ఊపిరి ఉక్కిరిబిక్కిరి



- పెరుగుతున్న ఆస్తమా రోగులు
- జిల్లాలో 8 శాతం మందికి రుగ్మత
- దీర్ఘకాలంగా మందులు వాడాల్సిందే
- నేడు ప్రపంచ ఆస్తమా దినోత్సవం

కర్నూలు(హాస్పిటల్): సృష్టిలోని ప్రతి జీవికి ఊపిరి ఎంతో అవసరం. ఒక్క నిమిషం ఊపిరి సరిగ్గా ఆడకపోతే ఆ వ్యక్తి పడే ఇబ్బంది అంతా ఇంతా కాదు. ముఖ్యంగా ఆస్తమా రోగులు పడే యాతన వారికి నరకంలా ఉంటుంది. ఈ వ్యాధికి చిన్నా పెద్దా తేడా తెలియదు. ఏ వయస్సు వారినైనా వేధించి ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఫలితంగా నిత్యం జేబులో నెబులైజర్ పెట్టుకోవడమో లేదా మూతికి ఆక్సిజన్ తగిలించుకోవడమే చేస్తూ ఉండాల్సిందే. ప్రతి సంవత్సరం మే నెలలో మొదటి మంగళవారం ప్రపంచ ఆస్తమా దినోత్సవంగా పరిగణిస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 18 శాతం మంది వివిధ రకాల ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్నారు. ఇందులో కేవలం ఆస్తమా జబ్బుతోనే 8 శాతం మంది (4 లక్షల మంది) ఇబ్బంది పడుతున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. ఆస్తమా అనేది శ్వాస లోపం, దగ్గు, ఊపిరితిత్తులు, గురకతో కూడిన దీర్ఘకాలిక ఇన్‌ఫ్లమేటరీ జబ్బు. ఈ లక్షణాలు రాత్రిళ్లు, చలికాలంలో మారుతూ ఉంటాయి. ఈ వ్యాధిగ్రస్తుల్లో దుమ్ము, ధూళి, పొగ, వాతావరణ మార్పులు, పుప్పొడి, వైరల్ ఇన్‌ఫెక్షన్ల వంటి ట్రిగ్గర్ల వల్ల ఊపిరితిత్తుల్లోని గాలి గొట్టాల్లో వాపు కనిపిస్తుంది. దీని వల్ల దగ్గు, పిల్లి కూతలు, ఆయాసం, ఛాతి బిగించినట్లు పట్టేయడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. రోగనిర్ధారణకు రోగి చరిత్ర, క్లినికల్ లక్షణాలను బట్టి చూస్తారు. అలాగే అలర్జీ కారకాన్ని గుర్తించేందుకు అలర్జీ చర్మ పరీక్ష చేయాల్సి ఉంటుంది.

అందుబాటులో ఆధునిక మందులు

పిల్లల్లో (చైల్డ్ ఆస్తమా), యువకుల్లో (లేట్ ఆస్తమా)గా పరిగణిస్తారు. ఇందులో దగ్గు, కఫం పడటం, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, పిల్లికూతలు ఎక్కువ రావడంతో పాటు తుమ్ములు, తలనొప్పి, ముక్కులు మూసుకుపోవడం తరచుగా జరుగుతాయి. రోగి లక్షణాల తీవ్రతను బట్టి చెస్ట్ ఎక్స్‌రే, పల్మనరీ ఫంక్షన్ టెస్టుల ద్వారా వైద్యులు ఆస్తమా వ్యాధిని నిర్ధారిస్తారు. దానికి తగ్గట్లుగా ఇన్‌హేలర్, నెబులైజేషన్ పద్ధతుల ద్వారా ఆస్తమాను నియంత్రిస్తారు. బ్రోన్కియాల్ థెర్మోప్లాస్టీ, బయోలాజికల్ ఇమ్యునోథెరపి వంటి అత్యాధునిక పద్ధతుల ద్వారా మొండి రకం ఆస్తమా జబ్బును నియంత్రించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

జీవనశైలి మార్చుకుంటే

ఆస్తమా ఉన్న వారు తప్పనిసరిగా వ్యాయామం చేయాలి. దీనివల్ల ఆస్తమా అటాక్స్ తగ్గుతాయి. ఈ కారణంగా రక్తప్రసరణ పెరిగి, కేలరీలు వినియోగమై బరువు తగ్గుతారు. బరువు తగ్గే కొద్దీ ఆస్తమా రిస్క్ తగ్గుతుంది. రక్తప్రసరణ పెరగడం వల్ల శరీరానికి మంచి ఆక్సిజన్ అంది అవయవాలన్నీ శక్తివంతమవుతాయి. అలర్జీలనే కాదు ఇన్‌ఫెక్షన్లను కూడా శరీరం తట్టుకోలదు.



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఊపిరితిత్తుల విభాగంలో చికిత్స పొందుతున్న రోగులు (ఫైల్)


పెద్దాసుపత్రిలో మెరుగైన వైద్యం



ఆస్తమాకు అవసరమైన అన్ని రకాల మందులు, చికిత్స కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉచితంగా లభిస్తాయి. ఆస్తమాతో వచ్చిన వారికి క్యాజువాలిటీలోనే నెబులైజర్ ద్వారా నెబులైజేషన్ అందిస్తారు. అక్కడ తగ్గకపోతే వెంటనే అడ్మిట్ చేసుకుని చికిత్స అందిస్తాం. ఇన్‌ఫెక్షన్ ఉంటే యాంటిబయాటిక్స్, అవసరమైతే నాన్ ఇన్‌వాసివ్ వెంటిలేటర్ అమరుస్తాం. రోగి అపస్మారక స్థితికి వెళ్తే వెంటిలేటర్ కూడా ఏర్పాటు చేస్తాం. ఇలాంటి చికిత్సకు ప్రైవేటుగా రోజుకు రూ.30 వేల నుంచి రూ.40 వేల దాకా ఖర్చవుతుంది.

– డాక్టర్ ఏఎస్ శ్రీకాంత్, హెచ్‌ఓడీ, టీబీసీడీ విభాగం, జీజీహెచ్, కర్నూలు

జాగ్రత్తలు తీసుకోవాలి



ఆస్తమా వ్యాధిగ్రస్తులు సంఖ్యాపరంగా తక్కువగా ఉన్నా మరణాల సంఖ్య ఎక్కువగా ఉన్నందున దీని నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాల్సిన అవసరం ఉంది. ఇది రోగనిరోధక వ్యవస్థలోని మార్పుల పరిస్థితి వల్ల వచ్చే అలర్జీ. ఎక్కువ మందికి జన్యుపరమైన కారణాలతోనే వస్తుంది. కుటుంబంలో ఎవరికైనా ఆస్తమా ఉంటే వారి పిల్లలకు వచ్చే అవకాశం ఉంది. వైద్యులు సూచించిన మేరకు మందులు వాడితే సాధారణ జీవితాన్ని గడిపేందుకు ఆస్కారం ఉంటుంది.

– డాక్టర్ సి.శ్రీనివాసరెడ్డి, ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణులు, కర్నూలు

డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టండి



ప్రజా ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): 40వ వార్డు సుబ్బారావు కాలనీలో డ్రైనేజీ కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు క్రిష్ణ, ఖాజా, అమీర్ బాషాలు విన్నవించారు. అలాగే తమ అర్హతలను బట్టి టిడ్కో ఇళ్లు కేటాయించాలని అర్జీదారులు రాజేశ్వరి, లక్ష్మీ కాంతయ్య, యశోద వినతిపత్రాలు అందజేశారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ ఎస్.రవీంద్రబాబు నగరంలోని వివిధ కాలనీల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని అధికారులకు సూచించారు. సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్‌ఓ జునీద్, ఎంఈ సత్యనారాయణ, టీపీఆర్ వెంకటలక్ష్మి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కర్నూలు (అర్బన్): నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి జమ్మి చెట్టు ప్రాంతంలో సోమవారం ముగ్గురు మహిళల నుంచి 12 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని బుధవారపేటకు చెందిన ఇర్ఫాన్ అనే వ్యక్తికి చేరవేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



స్టిక్కర్లను అతికిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): తక్షణమే విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఎం నగర కార్యవర్గ సభ్యుడు విజయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం 18వ వార్డు పరిధిలోని జొహరాపురంలో స్మార్ట్‌మీటర్లు వద్దు.. కరెంట్ బిల్లులు తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఇళ్లకు వెళ్లి స్టిక్కర్లను అతికించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు అధికారంలోకి రాగానే మద్దతు తెలపడం అన్యాయమన్నారు. స్మార్ట్‌మీటర్లతో అధికంగా కరెంట్ బిల్లులు వస్తాయని, పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలపై అదనపు భారం పడుతుందని, వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



అతిథులతో వేసవి శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ శ్రీ అభయాంజనేయ స్వామి ప్రఖండ విజ్ఞాన వికాస్ బాల సంస్కార కేంద్రం ఆధ్వర్యంలో హరిశ్చంద్ర శరీన్ నగర్ శ్రీ సద్గురు త్యాగరాజ సీతారామాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం సోమవారం ముగిసింది. వీహెచ్‌పీ దక్షిణాంధ్ర రాష్ట్ర మీడియా కన్వీనర్ మాళిగ భానుప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల్యం నుంచే హిందూ సనాతన ధర్మం గురించి తెలియజేయడం చాలా అవసరమన్నారు. శిబిరంలో పాల్గొన్న చిన్నారులు వీధుల్లో రామ్‌లల్లా విగ్రహంతో ప్రదర్శన నిర్వహించారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి ఈపూరి నాగరాజు, మాతృశక్తి కన్వీనర్ పావని, కరణం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

'సాయ్'కు ఎంపిక కావడం గర్వకారణం



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): కర్నూలు నగరానికి చెందిన తైక్వాండో క్రీడాకారులు జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో రాణించి సాయ్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) హాస్టల్‌కు ఎంపిక కావడం గర్వకారణమని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలోని యోగా హాలులో తైక్వాండో క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెడల్స్ ఇచ్చి అభినందించారు. వారు మాట్లాడుతూ.. తైక్వాండో మాస్టర్ సతీష్ ఆధ్వర్యంలో క్రీడాకారులు జాతీయ పోటీల్లో ప్రతిభ చాటడం గర్వకారణమన్నారు. టౌన్ మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ పునరుద్ధరణ కోసం ఉద్యమం



కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు విన్నవిస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

కర్నూలు(సెంట్రల్): సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఏపీసీపీఎస్‌ఈఏ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాజీ పఠాన్ పేర్కొన్నారు. సోమవారం రాష్ట్రంలోని 26 జిల్లాల కలెక్టర్లకు సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు ఇచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని మేల్కొల్పేందుకు మే 1 నుంచి చైతన్య యాత్రను చేపట్టినట్లు చెప్పారు. చైతన్య యాత్ర పూర్తయ్యేలోపు సమస్య పరిష్కారం కాకపోతే సెప్టెంబర్ 1నుంచి విద్రోహ దినాన్ని పాటిస్తామని హెచ్చరించారు. ఒకటే సర్వీసు అయినా పెన్షన్లు మాత్రం రెండు, మూడు రకాలుగా ఎందుకు ఉండాలని ప్రశ్నించారు. సీపీఎస్ ఉద్యోగులను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూడడం తగదన్నారు. అనంతరం చైతన్య యాత్ర పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల నిధులు కొట్టేశారు!

- రూ.167 కోట్లు పక్కదారి పట్టించిన కూటమి సర్కార్
- టెండర్ దశ నుండే అక్రమాలకు తెర
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల వెల్లడి



మాట్లాడుతున్న ఎస్వీ విజయ మనోహరి

కర్నూలు (టౌన్): బీసీ మహిళలకు కుట్టు మిషన్లు అందజేసేందుకు కేటాయించిన నిధుల్లో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరిగిందని కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ నాయకురాలు విజయ మనోహరి ఆరోపించారు. లక్ష మంది మహిళలకు జీవనోపాధి కల్పించేందుకు కేటాయించిన రూ.257 కోట్ల నిధుల్లో భారీగా అవినీతి జరిగిందన్నారు. సోమవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ హాలులో ఆమె మాట్లాడుతూ.. బీసీ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు, వారికి శిక్షణ కోసం ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల్లో రూ.167 కోట్లు దారి మళ్లించారన్నారు. టెండర్ దశ నుండే ఈ అవినీతికి తెర తీశారని ఆరోపించారు. నిధులన్నీ దోపిడీదారులకు చేరేలా రాష్ట్ర మంత్రి భర్త చక్రం తిప్పారని విమర్శించారు. ఈ స్కీమ్ అంచనాలను అమాంతం పెంచేసి తక్కువ కోట్ చేసిన వారికి కాకుండా, ఎక్కువకు కోట్ చేసిన రెండు కంపెనీలకు కట్టబెట్టారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడుతూ.. కుట్టు మిషన్ కొనుగోలుకు రూ.4,300, ఒకరికి శిక్షణ ఇచ్చేందుకు రూ.3 వేలు చొప్పున లక్ష మందికి రూ.73 కోట్లు ఖర్చవుతుందన్నారు. అయితే ప్రభుత్వం రూ.240 కోట్లు కేటాయించిందన్నారు. దీంతో కుట్టు మిషన్ల స్కామ్ విలువ రూ.167 కోట్లు అని వివరించారు. ఇదే కాకుండా త్వరలో కమ్మ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్, ఆర్యవైశ్య కార్పొరేషన్, క్షత్రియ కార్పొరేషన్ ఇలా.. 50 వేల కుట్టు మిషన్ల కోసం టెండర్లు వేస్తున్నట్లు చెప్పారు. బీసీ మహిళల పేరుతో రూ.కోట్లు కొల్లగొడుతున్న టీడీపీ నేతల అవినీతిని జిల్లావ్యాప్తంగా మహిళలందరికీ వివరిస్తామన్నారు. బీసీ సెల్ నగర అధ్యక్షుడు స్వాములు, జిల్లా కార్యదర్శి షరీఫ్, సర్వేశ్వర రెడ్డి, విద్యార్థి విభాగం సంయుక్త కార్యదర్శి శ్రవణ్ కుమార్, ప్రచార విభాగం అధ్యక్షుడు శ్రీను, చేనేత సంఘం నగర అధ్యక్షుడు కంటూ, మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు పత్త బాషా, ఎస్‌టీ బాబు, భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.

చిన్నారుల్లో ఆధ్యాత్మికత పెంపొందించాలి

కర్నూలు కల్చరల్: చిన్నారుల్లో ఆధ్యాత్మికతను పెంపొందించాల్సిన అవసరం ఉందని కేడీసీసీబీ మాజీ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి అన్నారు. చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళిలో జరుగుతున్న చిన్మయ బాలల వేసవి సంస్కార సాధన శిబిరాన్ని ఆమె సోమవారం సందర్శించి విద్యార్థులకు సందేశమిచ్చారు. విద్యార్థుల్లో ఆధ్యాత్మిక ప్రవృత్తిని ప్రజ్వలింపజేస్తూ దేశభక్తి, దైవభక్తి పెంపొందింప చేసే ఆటలు, పాటలు, డ్రామాలు, కోలాటాలు, భరత నాట్యం, డ్రాయింగ్, యోగా, భగవద్గీత శ్లోకాలు, భజనలు, కథలు తదితర అంశాలను చిన్నారులకు నేర్పించడం అభినందనీయమన్నారు. చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి మాట్లాడారు. సభ్యులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు అండగా వైఎస్సార్‌సీపీ

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీలకు అండగా నిలుస్తోందని ఆ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ హఫీజ్ మహమ్మద్ ఇలియాస్ అన్నారు. పార్టీ అధికార ప్రతినిధిగా ఎన్నికైన సందర్భంగా ఆయన్ను సోమవారం బళ్లారి చౌరస్తాలోని కార్యాలయంలో ముస్లిం మైనార్టీలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్డీఏ సర్కార్ వచ్చిన తరువాత దేశవ్యాప్తంగా ముస్లిం మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. ముస్లిం సమాజాన్ని నిర్వీర్యం చేసేందుకు వక్ఫ్ సవరణ బిల్లు తీసుకొచ్చారన్నారు. బిల్లును పార్లమెంటు, రాజ్యసభలోను వైఎస్సార్‌సీపీ తీవ్రంగా వ్యతిరేకించిందని గుర్తు చేశారు. బిల్లు ఉపసంహరించుకోవాలన్న డిమాండ్‌తో సుప్రీంకోర్టులో వైఎస్సార్‌సీపీ పిల్ వేసినట్లు తెలిపారు. ముస్లిం మైనార్టీలకు న్యాయం జరగాలంటే వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమన్నారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మైనార్టీలకు పదవులు, పథకాలు అమలు చేశారన్నారు. అలాంటి పార్టీని మరింత బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు.

చేతుల శుభ్రతతో ఆరోగ్యం

కోడుమూరు రూరల్: చేతుల శుభ్రంగా ఉంచుకోవడంతో ఆరోగ్యంగా జీవించవచ్చని సంచార వైద్య సేవ జిల్లా నోడలాఫీసర్ డాక్టర్ రఘు సూచించారు. ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కోడుమూరులోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైద్య సిబ్బంది చేతుల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. భోజనం తినడానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచానికే దిక్సూచిగా దాస్ కాపిటల్

కర్నూలు(సెంట్రల్): కారల్ మార్క్స్ రచించిన దాస్ కాపిటల్ ప్రపంచానికే దిక్సూచి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య పేర్కొన్నారు. సోమవారం సీఆర్ భవన్‌లో కారల్ మార్క్స్ జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే కాలంలో పెట్టుబడిదారి వ్యవస్థ కుప్పకూలక తప్పదన్నారు. కమ్యూనిస్టు భావజాలంతో పని చేసేవారు కారల్ మార్క్స్ విధానాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. నాయకులు పి.రామకృష్ణారెడ్డి, మునెప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

'నమస్తే'తో వ్యర్థాలు సేకరించే వారి అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న నగరపాలక ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి

కర్నూలు (టౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన నమస్తే (నేషనల్ యాక్షన్ పథకం ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్) పథకం ద్వారా వేస్ట్ పికర్స్ (వ్యర్థాలు సేకరించే) వారి జీవన ప్రమాణాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సుంకేసుల రోడ్డులోని నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో నమస్తే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యర్థాలను సేకరించే వ్యక్తులు, పారిశుద్ధ్య కార్మికులను (సఫాయి కర్మచారి) అధికారికంగా గుర్తించి వారిని ఆర్థికంగా మెరుగు పరచేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందు కోసం గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ చేయించాల్సి ఉంటుందన్నారు. వివరాలు నమోదు చేసుకొని వారికి వృత్తి నైపుణ్యం మెరుగుదలకు శిక్షణ ఇస్తామన్నారు. వ్యక్తిగత రక్షణ, పరికరాల కిట్లు, వ్యర్థాలను సేకరించే వాహనాల కొనుగోలుకు రూ.5 లక్షలు రాయితీతో కూడిన రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాల కోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేదా నమస్తే కార్యక్రమం ఇన్‌చార్జ్ 94924 69964 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు. స్టేట్ కో-ఆర్డినేటర్ అనిల్, ప్రాజెక్టు డైరెక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

7న దామోదరం వర్ధంతి

కర్నూలు(అర్బన్): స్వర్గీయ దామోదరం సంజీవయ్య 53వ వర్ధంతిని ఈ నెల 7వ తేదీన స్థానిక నంద్యాల చెక్‌పోస్టులోని ఆయన విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించనున్నట్లు మాల గెజిటెడ్ అధికారుల సంఘం గౌరవ సలహాదారు గోన నాగరాజు తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 7న ఉదయం 9 గంటలకు సంజీవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళి అర్పించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు రామకృష్ణ, రత్నప్రసాద్ హాజరవుతున్నారని, ఉమ్మడి జిల్లాలోని మాల గెజిటెడ్ అధికారులందరూ హాజరు కావాలని కోరారు. సంఘం చైర్మన్ సోమన్న, కోశాధికారి వై.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: వ్యాధులపై కేటాయించిన వార్డుల్లో అసంక్రమిత వ్యాధులపై సర్వే పకడ్బందీగా చేయాలని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. సోమవారం పట్టణంలో శిల్పా ఎస్టేట్‌లో ఆరోగ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాలు దాటిన వారికి షుగర్, రక్తపోటు, క్యాన్సర్, మానసిక రోగ పీడితులను స్క్రీనింగ్ పరీక్షలు చేయాలని సూచించారు. మహిళల్లో గర్భాశయ ముఖ ద్వార, రొమ్ము ఇతర క్యాన్సర్లను స్క్రీనింగ్‌లో గుర్తించాలన్నారు. తొలిదశలోనే ఆయా వ్యాధులను గుర్తిస్తే వాటిని నయం చేసే అవకాశం వుందని తెలిపారు. డాక్టర్ శ్రీనివాసబాబు, ఆరోగ్య విస్తరణ అధికారి విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ క్యాంటీన్ అగ్రిమెంట్ల ఫోర్జరీ



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో క్యాంటీన్ ఏర్పాటుకు చేసుకున్న ఐదేళ్ల అగ్రిమెంట్‌ను ఫోర్జరీ చేసి 30 ఏళ్లుగా మార్చారని ప్రభుత్వ వైద్యుల సంఘం కేఎంసీ శాఖ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్ ఆరోపించారు. ఒకే తేదీతో ఈ క్యాంటీన్‌పై రెండు అగ్రిమెంట్లు ఎలా వస్తాయని ఆయన ప్రశ్నించారు. సోమవారం ఆయన సంఘం సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేఎంసీ క్యాంటీన్‌ను 2013 జనవరి 29న ఐదేళ్ల పాటు డాక్టర్ వరప్రసాద్‌కు లీజుకు ఇస్తూ అప్పటి సంఘం సభ్యులు అగ్రిమెంట్ చేశారన్నారు. ప్రతి నెలా రూ.4 వేలు అద్దె, రెండేళ్లకు పది శాతం అద్దె పెంచేలా ఒప్పందం చేసుకున్నారని, ఐదేళ్ల తర్వాత సంఘానికి తిరిగి అప్పగించాల్సి ఉందని చెప్పారు. అయితే 12 ఏళ్లు దాటినా అప్పగించకపోగా ఇప్పటికీ రూ.4 వేలు మాత్రమే అద్దె చెల్లిస్తున్నారన్నారు. లీజు గడువు ముగిసినందున ఖాళీ చేయమని చెబితే, క్యాంటీన్ విషయంలో ఎవ్వరూ జోక్యం చేసుకోకుండా కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చారన్నారు. క్యాంటీన్‌ను మంగళవారం సంఘం స్వాధీనం చేసుకోబోతోందని తెలిపారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, కళాశాల ప్రిన్సిపల్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్లు జోక్యం చేసుకోవాలని కోరారు. సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ రామశివనాయక్, ట్రెజరర్ డాక్టర్ దమామ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప మాట్లాడుతూ.. వెంటనే ప్రతి జిల్లాలో లేబర్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు ఇవ్వాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో వెట్టి చాకిరీ చేయిస్తున్నాయని, ఇది లేబర్ చట్టాలకు విరుద్ధమన్నారు. వెంటనే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్, టి.రామాంజనేయులు, ఈశ్వర్, నాగరాజు, జయరాం పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ విగ్రహాలు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని గార్గేయపురం గ్రామంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర మఠంలో స్వామి ఆరాధనోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గర్భాలయంలోని మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి, సిద్ధయ్య విగ్రహాలకు గంగ, పంచామృతం, క్షీరం, ఫలోదకాలతో అభిషేకం చేశారు. విగ్రహ మూర్తులకు ప్రత్యేక వస్త్రాలంకరణ చేశారు. స్వామి గుణగణాలను కీర్తిస్తూ, 108 నామలతో స్తుతిస్తూ సహస్ర నామార్చన చేపట్టారు. ఆరాధనోత్సవాలు ముగిసే వరకు నిత్యం వివిధ గ్రామాల భజన మండళ్లతో అఖండ భజన కార్యక్రమాలు ఆలయంలో నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ నెల 8న నిర్వహించే రథోత్సవం ఉత్సవాల్లో ప్రత్యేకం. ఇందులో పాల్గొనేందుకు సమీపంలో ఉన్న గ్రామాలు శివరామాపురం, కేతవరం, పూడిచెర్ల, దిగువపాడు నుంచి భక్తులు తరలి రానున్నారు.

'మావోయిస్టులతో చర్చలు జరపాలి'



ర్యాలీగా వస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): తెలంగాణలోని కర్రె గుట్టలపై మోహరించిన సైన్యాన్ని ఉపసంహరించి ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు శాంతి కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, ప్రభుత్వం మావోయిస్టుల పేరుతో చేస్తున్న దాడుల్లో అమాయక ఆదివాసీలు బలైపోతున్నారని, తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని కోరారు. మావోయిస్టులతో మాట్లాడి వారి డిమాండ్లను పరిష్కరించాలన్నారు. వెంటనే కర్రె గుట్టలపై ఉన్న 20 వేల కేంద్ర బలగాలను వెనక్కి పిలిపించాలన్నారు. రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ భాస్కరరెడ్డి, డీటీఎఫ్ కార్యవర్గ సభ్యుడు రత్నం ఏసేపు, పలు రాజకీయ పార్టీలు, ప్రజా, విద్యార్థి, మహిళా సంఘాలు పాల్గొన్నాయి.

11న షర్మిళ కర్నూలు పర్యటన

కర్నూలు(సెంట్రల్): పీసీసీ అధ్యక్షురాలు షర్మిళ మే 11న కర్నూలుకు వస్తున్నట్లు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా పీసీసీ అధ్యక్షురాలు 11వ తేదీన సాయంత్రం 3 గంటలకు కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గాల కో-ఆర్డినేటర్లు, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంస్థల నాయకులు, మండల అధ్యక్షులు, నగర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బీసీ కులగణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

కల్లూరు: బీసీల కులగణన చేపట్టేలా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నంద్యాల పార్లమెంట్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ మెంబర్ జె.లక్ష్మి నరసింహ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కృషి వల్లే కేంద్ర బీసీల కులగణన చేపట్టేలా నిర్ణయం తీసుకుందన్నారు. దీంతో సోమవారం కర్నూలు నగరం నంద్యాల చెక్‌పోస్టు సర్కిల్‌లో రాహుల్ గాంధీ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

